ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ రాష్ట్ర అభివృద్ధికి రీజియన్ల వారీగా ప్రణాళికలు చేపట్టినట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించారు.

❖ అక్వాన్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.

❖ రెండో విడత సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత భద్రతా చర్యలు చేపట్టామని ఐ.జీ. బి.రాజకుమారి తెలిపారు.

❖ అక్వాన్ తుఫాను విశాఖపట్టణానికి దక్షిణ - ఆగ్నేయంగా 650 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

==========

రాష్ట్రంలో విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి రీజియన్ల వారీగా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలియజేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో ఈరోజు సమావేశమైన ఆయన.. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికల అంశంపై చర్చించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ లో భాగంగా వివిధ స్థాయిల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నామన్నారు. గ్రామాలకు రోడ్ నెట్ వర్క్, ఇరిగేషన్ అభివృద్ధి పనులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నామని పేర్కొంటూ.. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ శర వేగంగా అభివృద్ధి చెందుతోందన్న ముఖ్యమంత్రి.. దీనికి ఇప్పటికే కేంద్రం నుంచి సహకారం అందుతోందని.. అదనంగా మరింత సహాయం అందించగలిగితే అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతాయని వివరించారు. అలాగే.. ఇటీవలి సీఐఐ భాగస్వామ్య సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వచ్చిన పెట్టుబడులు, జరిగిన చర్చల సారాంశాన్ని ముఖ్యమంత్రి... కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు.

==========

అక్వాన్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్.డబ్ల్యూ.ఎస్. సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈరోజు వివిధ శాఖల అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో తుఫాన్ సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఇటీవలి రెండు తుఫానులతో పోలిస్తే.. అక్వాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లోను, ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లోను ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసుకోవాలని, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ తదితర విభాగాలను సమన్వయం చేసుకుంటూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.

==========

రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు విస్తృతమైన భద్రతా చర్యలు చేపట్టామని ఐజీ బి. రాజకుమారి తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన చేస్తూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 14 నుండి, 16 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, నమోదు చేసిన కేసులు, ఇతర వివరాలను ఆమె వెల్లడించారు. మొత్తం 24 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని, 444 ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులు ఉన్నాయని చెప్పారు. సుమారు 200 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద 722 కేసులను, 5 వేల 327 మంది వ్యక్తులను బైండ్ ఓవర్ చేసినట్లు రాజకుమారి వివరించారు.

==========

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ONGC వెల్ రిగ్ వద్ద ఈ ఉదయం చోటు చేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొందని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన.. ఎస్పీ రాహుల్ మీనా, పి. గన్నవరం శాసనసభ్యులు గడ్డి సత్యనారాయణలతో కలిసి పాల్గొన్నారు. గ్యాస్ లీకేజీ సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ప్రజల ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన ముందస్తు రక్షణ చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. చుట్టు పక్కల 500 మీటర్ల పరిధిలోని సుమారు 300 కుటుంబాలను వెంటనే సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని కలెక్టర్ పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========

ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం సమీపంలోని పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) పి.వి. సందీప్ రెడ్డి సూచించారు. పెద్దపులి కదలికలను VHF పరికరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, దానిని సురక్షితంగా బంధించేందుకు పూణే నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పిస్తున్నామని తెలియజేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పొలాల వైపు వెళ్లవద్దని, రెస్క్యూ ఆపరేషన్‌కు ప్రజలు సహకారం అందించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని డీఎఫ్ఓ విజ్ఞప్తి చేశారు.

==========

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (APSDMA) సూచనల ప్రకారం జిల్లాలో రానున్న 3 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ తెలిపారు. అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో రేపు ఓ మోస్తరు వర్షాలు పడే సూచన ఉందని, అలాగే ఈ నెల 19, 20వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదు అవుతాయని, గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాల అంచనా ఉన్నందున ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, పల్లపు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా డివిజన్, మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

==========

అక్వాన్ తుఫాను విశాఖపట్టణానికి దక్షిణ - ఆగ్నేయంగా 650 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 650 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ.. ఈ నెల 19 ఉదయానికి మరింత బలపడి `అత్యంత తీవ్ర తుఫాను`గా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఇది అత్యంత తీవ్ర తుపానుగా కొనసాగుతూ.. ఈ నెల 20న నెల్లూరు - విశాఖపట్టణం ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గంటకు 120 నుండి 130 కిలోమీటర్ల వేగంతోను, గరిష్టంగా గంటకు 145 కిలోమీటర్ల వేగంతోను గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========

విజయనగరం జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, భూ కేటాయింపుల పురోగతిపై సంయుక్త కలెక్టర్ సేధుమాధవన్ ఈరోజు తహసీల్దార్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు రహదారి విస్తరణ, కొత్తవలస నుంచి విజయనగరం వరకు నాలుగవ రైల్వే లైన్ నిర్మాణం ఈ రెండు అత్యంత ప్రాధాన్యత గల కనెక్టివిటీ ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల మండలాల వారీ పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించారు. క్షేత్రస్థాయి పనులు ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేలా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని, ఉమ్మడి తనిఖీలను పూర్తి చేయాలని తహసీల్దార్లకు సూచించారు. అలాగే.. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు.

==========

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు నీటి కాలువల్లో పేరుకు పోయిన పూడికను తక్షణమే తొలగించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి మురుగు నీటి పారుదల వ్యవస్థను, ప్రధాన కాలువల అవుట్ లెట్లను.. నగర పాలక సంస్థ కమిషనర్, జీజీహెచ్ అధికారులతో కలిసి ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

==========
==========